క్లుప్తంగా

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కల్లూరు: స్థానిక 32వ వార్డులోని 80, 81, 82 వార్డు సచివాలయాలలో గురువారం అంబేడ్కర్ చిత్ర పటాలకు వార్డు కార్పొరేటర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ, బీసీ విభాగాల నాయకులు రాజు, గోపీనాథ్, హుస్సేన్ సాహెబ్, సుందరం, షేక్షావలి, రామన్న, కుల్లాయమ్మ, మాదన్న పాల్గొన్నారు.

1,800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి తండా పరిసర ప్రాంతాల్లో 1,800 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ (ట్రైనింగ్ డీఎస్పీ) భావన ఆధ్వర్యంలో ఎస్‌ఐ నల్లప్ప పోలీసు సిబ్బందితో కలిసి గురువారం సోదాలు నిర్వహించారు. సారా బట్టీలను గుర్తించి బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

- గడివేముల: మండల పరిధిలోని ఉండుట్ల గ్రామ పరిసరాల్లో నాటు సారా తయారు చేస్తున్నారని సమాచారంతో గురువారం పోలీసులు సోదాలు నిర్వహించారు. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి నాగమణి తెలిపారు. బటీ నిర్వహిస్తున్న దాసు నాయక్ పారిపోయాడని, త్వరలోనే పట్టుకుంటామని ఆమె తెలిపారు.

ఆక్రమణ స్థలాల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను గురువారం జిల్లా పంచాయతీ అధికారులు తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్పో) నాగరాజు నాయుడు, డివిజన్ లెవల్ పంచాయతీ అధికారిణి (డీఎల్‌పీఓ) తిమ్మక్క, కోడుమూరు సీఐ మనుసూరిద్దీన్, మండల అధికారులు, సి.బెళగల్, గూడూరు పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. కోర్టు కేసులో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమంగా నిర్మించిన ఇంటి సభ్యురాలుకి తొలగింపు నోటీసులు ఇచ్చిన అధికారులు ప్రహరీని మాత్రం తొలగించారు. అయితే నిర్మాణాలకు అనుమతులు తెచ్చుకునేందుకు గడువులు ఇవ్వాలని గ్రామస్తులు కోరడంతో అధికారులు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు తహసీల్దార్ శేష ఫణి, ఈఓఆర్డీ సందీప్, సి.బెళగల్, గూడూరు ఎస్ఐలు మన్మథ్‌విజయ్, పీరయ్య పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో లింగేష్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాండ్లు తీసుకెళ్లండి

కర్నూలు (లీగల్):లోపాలున్న అగ్రిగోల్డ్ బాండ్లను తీసుకెళ్లాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న ఉదయం 10:30 నుంచి సాయంత్రం5 గంటల్లోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో రశీదులను తీసుకు వచ్చి ఒరిజినల్ బాండ్లను వాపసు తీసుకెళ్లాలన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ





గాయపడిన హనుమంతు, చాకలి నరసన్న

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నంబట్టీల వద్ద గురువారం సాయంత్రం స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సున్నంబట్టీల వద్ద తెలుగు హనుమంతు, చాకలి సంఘం వారికి కొంతకాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. స్థలాన్ని తాము కొనుగోలు చేశామని తెలుగు హనుమంతు కుటుంబ సభ్యులు చెబుతుండగా, తమకు గతంలో ప్రభుత్వం కల్యాణ మండపం కోసం స్థలం ఇచ్చిందని చాకలి సంఘం వారు చెబుతున్నారు. ఇదే విషయమై సాయంత్రం రెండు వర్గాల వారు గొడవకు దిగడంతో ఈ ఘర్షణలో తెలుగు హనుమంతు, రవి, మహనందిలకు గాయాలయ్యాయి. అలాగే చాకలి నరసన్న, రఘు, మరో మహిళకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

జగనన్న పాలనను
మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పరిహారం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పారదర్శక పాలన అందజేస్తున్న జగనన్న పాలనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని శకునాల గ్రామంలో పర్యటగించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేస్తూ సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ప్రజలను కోరారు.

టీడీపీ దుష్ప్రచారాలను నమ్మొద్దు

టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు సూచించారు. హామీలను నెరవేరుస్తూనే, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తేవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగనన్న అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివ ప్రసాద్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, సర్పంచు జంగం రాధిక, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఎంపీటీసీ సభ్యలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు బీరం పుల్లారెడ్డి, కె.శివారెడ్డి, సాంబశివారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం

సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందజేస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాదుపు భవనంలో గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన బాధిత రైతులకు ఎమ్మెల్యే అడ్వాన్స్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మెగా సోలార్ పరిశ్రమలో పిన్నాపురం గ్రామానికి చెందిన 180 మంది రైతులకు సంబంధించిన 400 ఎకరాల భూమిని కోల్పోవడం జరిగిందన్నారు. ఈ భూములకు ప్రభుత్వం ఎకరాకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. బాధితులకు ప్రభుత్వం త్వరలోనే పరిహారం సొమ్మును విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అడ్వాన్స్ కింద ఎకరాకు రూ.1లక్షల చొప్పున గ్రీన్‌కో సంస్థ అందజేయడం అభినందనీయమన్నారు. సొమ్మును బాధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీన్‌కో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాసనాయుడు, స్థానిక జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, పాణ్యం జెడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



శకునాలలో సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో శుక్రవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహిస్తున్నామని ఈఓఆర్డీ సందీప్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు అందరూ తప్పకుండా అందుబాటులో ఉండాలని ఈఓఆర్డీ అన్నారు.

భూమి కొనుగోలు పథకంపై విచారణ జరిపించండి

కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని భూమి కొనుగోలు పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల వెంకటేష్ గురువారం విజయవాడలోని ఎస్సీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సునీల్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ని ఆదోని, బనగానపల్లె ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయని,ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌టీఏ యాక్ట్‌కు విరుద్ధంగా ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు.

గ్రామ పంచాయతీలకు రూ.12.43 కోట్లు విడుదల



డీపీఓ నాగరాజు నాయుడు

సి.బెళగల్: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక రెండవ విడతలో భాగంగా జిల్లాకు రూ.12,43,37,141 విడుదల చేసిందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీపీఓ ఆయన మాట్లాడారు. జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలకు మినహా (ఎన్నికలు జరగని ఆదోని మండలంలోని సదాపురం, మండగిరి గ్రామ పంచాయతీ) 482 గ్రామ పంచాయతీలకు నిధులు జమ చేయడం జరిగిందన్నారు. పంచాయతీ అధికారులు నిధులను గ్రామ అవసరాలకు ప్రధాన్యతాక్రమంలో సక్రమంగా, ప్రభుత్వ నింబంధనల మేరకు వినియోగం అయ్యేలా చూడాలని సూచించారు.

రబీ పంటల నమోదు వేగంగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రబీ కింద రైతులు సాగు చేసిన పంటల నమోదును వేగంగా పూర్తి చేయాలని ఏఓ రవిప్రకాష్ ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. గురువారం కోడుమూరులోని వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఆర్‌బీకే సిబ్బందితో జిల్లా వ్యవసాయ కార్యాలయం నుంచి వచ్చిన ఏఓ ప్రేమలత, ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించారు. ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయడంతో పాటు, ఈకేవైసీని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఏఓ ప్రేమలత మాట్లాడుతూ మండలంలోని 21ఆర్‌బీకేలకు ప్రభుత్వం విడుదల చేసిన ఎరువులు, మందుల వివరాలకు సంబంధించిన రికార్డులను సిబ్బంది పూర్తిగా నమోదు చేసి ఉండాలని సూచించారు. అనంతరం వారు కోడుమూరులోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి ఎరువుల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ తస్లీమ్ ఉన్నారు.

ప్రభుత్వ అనుమతులున్న ఎరువులనే అమ్మాలి



సి.బెళగల్‌లోని మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని ఏఓ మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లో పర్యటించి ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో అనుమతులు, నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ యజమానులతో మాట్లాడుతూ, అనుమతులు లేని వస్తువులను అమ్మినట్‌లైయితే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. శ్రీ మంజునాథ్, ఓం నాగసాయి దుకాణాలలో సేకరించిన పురుగు మందు నమూనాలను గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం ల్యాబ్‌లకు పంపుతున్నట్లు తెలిపారు.

వైద్యులకు ముగిసిన శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): మాతృమరణాలను తగ్గించేందుకు వైద్యులకు రెండు రోజులుగా ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. రెండోరోజు డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్దాస్పత్రి గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ గర్భస్థకాలంలో వచ్చే రక్తహీనత, రక్తస్రావం, డయాబెటీస్, అధిక రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యలను గుర్తించి చేయాల్సిన చికిత్స, రెఫరల్ విధానంపై వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రమాదకర లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స చేసి అవసరమైన వారిని అన్ని వసతులున్న ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్మాన్ సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ కావ్య, డెమో ప్రమీలమ్మ, డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర, పీసీ పీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో గురువారం స్వామి వివేకనంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొని వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జే.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని దేవాలయంగా భావించాలి

కర్నూలు కల్చరల్: ప్రజాస్వామ్యాన్ని దేవాలయంగా భావించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర సూచించారు. గురువారం నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామ మందిర ప్రారంభానికి కాంగ్రెస్ రాకపోవడం బాధాకరమన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోణంలో చూడటం భావ్యం కాదని హితువు పలికారు. సమావేశంలో బీజేపీ జిల్లా ట్రెజరర్ లోకేశ్వరయ్య, నాయకులు శ్రీను, రామాంజి పాల్గొన్నారు.

ఎవరికీ డబ్బులివ్వొద్దు

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు తమ రెగ్యులరైజేషన్‌కు ఎవరికీ డబ్బులివ్వొద్దని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డ్రాయింగ్ ఆఫీసర్ వద్ద వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలని, అర్హత ప్రమాణాల ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తామని ఆయన తెలిపారు.

మునిసిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెల విరమణ

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె విరమించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. గురువా రం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు గతంలో ఇస్తున్న వేతనానికి రూ.6 వేలు కలిపి ఇవ్వ డంతో వారి వేతనం రూ.21 వేలకు చేరిందన్నారు. అదనంగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు ఉంటాయ న్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంబంధించి 2017 నుంచి ఎవరికై తే జీతాలు పెరగలేదో వారికి జీతాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

డాక్టర్ బీర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: విజయవాడలో ఈనెల 19వ తేదీన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పిలుపు నిచ్చారు. గురువారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అంబేడ్కర్ విగ్రహానికి రూప కల్పన చేసారని కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.440 కోట్లు వెచ్చించి విజయవాడలో నిర్మించారని పేర్కొన్నారు. విజయవాడలో 23 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారన్నారు. ఇందులో అంబేడ్కర్ చరిత్ర, తదితర విషయాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎన్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప, మండల, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, కే నాగులాపురం నరసింహారెడ్డి, ఉల్చాల వాసు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి సారించాలి



పంటనీటి ప్రణాళికలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: తక్కువ నీటితో పండే పంటలపై రైతాంగం శ్రద్ధ చూపాలి భూ గర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏఓ మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా పంటనీరు ప్రణాళికలపై మండల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు పంటనీటి ప్రణాళికల వివరాలను తెలియజేశారు. నీటి వృథా అవుతున్న తీరును వివరించారు. రైతులు తక్కునీటితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకుని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై మక్కువ చూపాలని రైతులకు సూచించారు. అసిస్టెంట్ జీయోఫిజిస్ట్ సువర్ణ కుమార్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా) రాజేంద్ర ప్రసాద్ తదితరులు నీటి ప్రయోజనాలను వివరించారు.

ముగిసిన ఐటీసీ వెండర్ జోన్ వేలాలు

- రెవెన్యూకు రూ.4.25 లక్షల ఆదాయం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ఐటీసీ సర్కిల్ వద్ద ఉన్న వెండర్ జోన్‌కు గురువారం నగరపాలక కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. వీధి వ్యాపారులు ఒకే చోట వ్యాపారం చేసుకునే విధంగా వెండర్ జోన్ నూతనంగా నిర్మించారు. ఇందులోని షాపుల కోసం నగరపాలక రెవెన్యూ అధికారులు రూ.3.50 లక్షలు గుడ్ విల్ విధించారు. ఈ వేలాన్ని దక్కించుకునేందుకు కుమ్మరి పురుషోత్తం (గోకులపాడు), కడెం పెద్దన్న (రాఘవేంద్రనగర్), డి.మహబూబ్‌బాషా (దిన్నెదేవరపాడు), పింజరి షేక్షావలీ (పెద్దపాడు) పోటీ పడ్డారు. అత్యధికంగా రూ.4.25 లక్షలు పాడి వెండర్‌జోన్‌ను కడెం పెద్దన్న దక్కించుకున్నారు. వేలాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు



గూడూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు సూచించారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ రెండవ రౌండ్, సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీలను డీఎల్‌పీఓ తిమక్క, గ్రామ సర్పంచ్ పాండురంగన్నతో కలిసి డీపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడల ప్రాధాన్యత, క్రీడాకారులు వ్యవహారం, ప్రతిభ అంశాలను వివరించారు.

గూడూరు: ఆడుదాం ఆంధ్రా పోటీలు పట్టణవాసులను అలరిస్తున్నాయి. మండల స్థాయి పోటీలు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం హోరాహోరీగా సాగాయి. కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, ఖో ఖో పోటీలు ఆకట్టుకున్నాయి. ఎంపీడీఓ రాముడు రాముడు మాట్లాడుతూ సచివాలయాల నుంచి వచ్చిన 35 జట్లు మండల స్థాయిలో తల పడుతున్నాయన్నారు. శుక్రవారం నాటికి మండల స్థాయి విజేతలు తెలుస్తుందని, అనంతరం వీరిని నియోజక వర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. ఎంఈఓ సునీలమ్మ, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలతో గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు లభించడంతో పాటు, ఎంతో మేలు చేకూరుతుందని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీడీఓ ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీఎస్‌లు వెంకటేశ్వర్లు, ఉసేన్, పీడీ సురేంద్ర నాయుడు, జూనియర్ అసిస్టెంట్ సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు, వలంటరీలు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

గడివేముల: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం మండల కేంద్రంతో పాటు కరిమద్దెల, గని, గడిగరేవుల జెడ్పీ పాఠశాలల ఆవరణంలో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో గ్రామీణ యువత ఉత్సహంగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పలువురు ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

పాణ్యం: మండల స్థాయిలో నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడలను గురువారం ఎంపీడీఓ దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటుకోవాలని క్రీడాకారులకు సూచించారు. విజేతలను జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



గడివేముల జెడ్పీ స్కూల్‌లో నిర్వహిస్తున్న కబడ్డీలో తలబడుతున్న ఆటగాళ్లు



వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ దస్తగిరి



గూడూరులో ఖో ఖో ఆడుతున్న క్రీడాకారులు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్



సి.బెళగల్‌లో రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు